చలో నల్గొండ బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సండ్ర

కృష్ణా జలాల పరిరక్షణకు తరలిరండి

13న నల్గొండలో బీఆర్ఎస్ బహిరంగ సభ

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

బహిరంగ సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 10 : కృష్ణా జలాల పరిరక్షణ కోసం ఈ నెల 13వ తేదీన నల్గొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అధినేత కేసీఆర్ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు తరలిరావాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సండ్ర మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జలాలు, సంపద విషయంలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతున్నదని, స్వరాష్ట్రం ఏర్పాటైతే తెలంగాణ ప్రజలకు కృష్ణా, గోదావరి జలాలు అందడంతోపాటు తెలంగాణ సంపద తరలిపోదని భావించి కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించి కృష్ణా జలాలను కేంద్రం నుంచి పోరాడి నాగార్జునసాగర్ కాలువల ద్వారా తెలంగాణ ప్రజలకు అందించారన్నారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు రాష్ట్రాలను గుప్పిట్లో ఉంచుకోవాలని భావించి కృష్ణా యాజమాన్య బోర్డును కేంద్రానికి అప్పగించాలని, సీఆర్‌కే పరిధిలోకి బోర్డును తీసుకురావాలని చూస్తోందన్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం జనవరిలో జలాల అంశంపై ఏర్పాటైన సమావేశంలో ఎటువంటి అభ్యంతరం చేయకపోగా.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కృష్ణా జలాలు తరలిపోయేలా చూశారని విమర్శించడం తగదన్నారు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా తెలంగాణలోని అన్ని పార్టీలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. 13న నల్గొండలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యే బహిరంగ సభకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని సండ్ర కోరారు. అనంతరం నల్గొండ బహిరంగ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

సంఘటితంగా పోరాడుదాం..

నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులపై ఎక్కడైనా దాడి జరిగితే శ్రేణులందరూ సంఘటితంగా పోరాడాలని సండ్ర వెంకటవీరయ్య అన్నారు. నియోజకవర్గంలో గత, ఇప్పటి పాలకుల వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రఫీ, కోఆప్షన్ సభ్యుడు పాషా, సొసైటీ అధ్యక్షుడు చల్లగుళ్ల కృష్ణయ్య, డీసీసీబీ డైరెక్టర్ మోదుగు పుల్లారావు, ఆత్మ మాజీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, సదాశివునిపాలెం మాజీ ఉప సర్పంచ్ కాలినేని వెంకటేశ్వరరావు, గంగారం మాజీ సర్పంచ్ మందపాటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్డా శంకర్‌రావు, జొన్నలగడ్డ శ్రీను, వల్లభనేని పవన్, మాధురి మధు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ తులసి పూజలు



రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఫిబ్రవరి 10 : శనివారం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలోని అంతరాలయంలో ధ్రువమూర్తులకు అర్చకులు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం తదితర పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి కల్యాణాన్ని భక్తులు తిలకించగా.. వారికి స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

గందరగోళం గ్యారెంటీ!

- దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడంలో పొరపాటు
- కన్స్యూమర్ నెంబర్ తప్పుగా నమోదు కావడంతో రిజెక్ట్ చేసిన యాప్
- జిల్లావ్యాప్తంగా 72,500 ఇళ్లల్లో రీ సర్వే చేస్తున్న బృందాలు
- 200 యూనిట్ల కరెంటు అమలుకు పట్టాలెక్కని సర్వే

కొత్తగూడెంలో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల్లో గ్యాస్ కన్స్యూమర్ నెంబర్‌ను వెరిఫికేషన్ చేస్తున్న బృందాలు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రెండింటిని మాత్రమే అమలు చేశారు. మరో రెండు గ్యారెంటీలను అమలు చేస్తామని చెబుతున్నా.. ఆదిలోనే హంసపాదు ఎదురుకావడంతోపాటు ఎన్నో చిక్కులు వచ్చిపడ్డాయి. గ్యాస్ వినియోగదారులు చేసుకున్న దరఖాస్తులను కంప్యూటర్ ఆపరేటర్లు కన్స్యూమర్ నెంబర్‌ను ఆన్‌లైన్ చేయడంలో జరిగిన పొరపాటుతో ముప్పు తిప్పలు పడుతున్నారు. గ్యాస్ వినియోగదారుల ఐడీ నెంబర్లు తప్పుగా నమోదు కావడంతో యాప్ కొంత మంది దరఖాస్తులను రిజెక్టు చేసింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సర్వే బృందాలు మళ్లీ రంగంలోకి దిగాయి. రెండు రోజుల నుంచి పంచాయతీ, మున్సిపాలిటీల పరిధిలో ఇంటింటికి తిరుగుతూ గ్యాస్ కనెక్షన్ నెంబర్‌ను యాప్‌లో ఆన్‌లైన్ చేస్తున్నారు. దీంతో తమకు గ్యాస్ గ్యారెంటీ పథకం వర్తిస్తుందా.. లేదా.. అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

72,500 ఇళ్లల్లో రీ సర్వే..

కొందరు కంప్యూటర్ ఆపరేటర్ల తప్పిదం వల్ల ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను రీ సర్వే చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 23,33,235 మంది దరఖాస్తులను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేశారు. అందులో ఆరు గ్యారెంటీల అర్హులతోపాటు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రజలు చేసుకున్న దరఖాస్తులను ఆగమేగాలపై రాత్రికి రాత్రే ఆపరేటర్లతో కంప్యూటర్లలో ఆన్‌లైన్ చేయించారు. ఈ క్రమంలో కొందరు కార్యదర్శులు కూడా ఆన్‌లైన్ చేశారు. ఇంత చేసినా గ్యాస్ వినియోగదారుల ఐడీ నెంబర్లు తప్పుగా నమోదు కావడంతో జిల్లాలోని 72,500 మంది దరఖాస్తులను యాప్ రిజెక్టు చేసింది. దీంతో అధికారులు మరోసారి సర్వే చేయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇందుకోసం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక బృందాలను నియమించి అక్కడికక్కడే యాప్‌లో వివరాలను ఆన్‌లైన్ చేయిస్తున్నారు.

200 యూనిట్ల కరెంటు ఉత్తమాటేనా?

ఆరు గ్యారెంటీల్లో భాగంగా 200 యూనిట్ల విద్యుత్ వాడుకునే వినియోగదారులకు ఉచిత విద్యుత్‌పై ఇప్పటివరకు పూర్తిస్థాయి సర్వే చేయలేదు. ప్రతి నెల విద్యుత్ బిల్లులు వస్తున్నా.. దానిపై ఆ శాఖ ఎలాంటి చర్యలకు ముందడుగు వేయలేదు. ఒకవేళ సర్వే చేయాలనుకున్నా.. విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే సిబ్బంది ఇంటి యజమాని ఆధార్, రేషన్ కార్డు నెంబర్ అడిగి సర్వే చేస్తారు. కానీ.. కార్యరూపం దాల్చలేదు. జిల్లా వ్యాప్తంగా గృహ విద్యుత్ వినియోగదారులు 2,82,435 మంది ఉండగా.. ఇందులో 200 యూనిట్ల విద్యుత్ వాడుకునేవారు 2,51,093 మంది ఉన్నారు. అంతకంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగించే వారు 31,342 మంది ఉన్నారు. వారి ఆధార్ నెంబర్లు, రేషన్ కార్డు వివరాలు కూడా ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. దీనిపై విద్యుత్ శాఖ ఎస్ఈ రమేశ్‌ను వివరణ కోరగా.. ఇంకా రెండు నెలల సమయం పట్టవచ్చని చెబుతున్నారు.

అప్‌లోడ్‌లో తప్పులు దొర్లాయి

గతంలో ఇచ్చిన దరఖాస్తుల్లో ప్రజలు నెంబర్లు తప్పు వేశారో.. కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేసే సమయంలో తప్పుగా పడిందో తెలియదు. దీంతో మళ్లీ సర్వే చేయమన్నారు. గ్యాస్ వినియోగదారులు నెంబర్లు మిస్‌మ్యాచ్ అయ్యాయి. అందువల్ల మళ్లీ యాప్‌ను ఇచ్చి ఇంటింటికి వెళ్లి ఆన్‌లైన్ చేయమని ఆదేశించాం. రెండు రోజుల్లో సర్వే పూర్తవుతుంది.

– మధుసూదనరాజు, అదనపు కలెక్టర్ భద్రాద్రి

దేశ ప్రతిష్ఠను నిలబెట్టేది క్రీడాకారులే..

- రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ప్రారంభంలో జడ్పీ చైర్మన్ కంచర్ల
- ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చుంచుపల్లి, ఫిబ్రవరి 10: దేశ ప్రతిష్ఠను నిలబెట్టేది క్రీడాకారులేనని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 33 జిల్లాల నుంచి 800 మంది అథ్లెట్లు పాల్గొనడం గొప్ప విషయమని అన్నారు. తొలుత రాష్ట్ర అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సారంగపాణి ఒలింపిక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించడం ద్వారా కార్మిక ప్రాంత క్రీడాకారులు స్ఫూర్తి పొందుతారని అన్నారు. తాండ్ర నారాయణరావు ట్రస్టు స్పాన్సర్‌గా వ్యవహరించింది. అథ్లెటిక్, ఒలింపిక్ అసోసియేషన్ల బాధ్యులు, వివిధ సంఘాల నాయకులు గొట్టపు రాధాకృష్ణ, మహిధర్, హనుమంతరావు, రాజేంద్రప్రసాద్, సలిగంటి శ్రీనివాసరావు, నాగబాబు, ఇనుగంటి రాము, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు. కాగా, పోటీల ఓవరాల్ ఛాంపియన్‌గా ఆదిలాబాద్ జట్టు నిలిచింది.

నేడు, రేపు టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : ఖమ్మం నగరంలోని నయాబజార్ పాఠశాల కేంద్రంగా ఆది, సోమవారం టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అంతరాలు లేని విద్య ప్రజల హక్కు-ప్రభుత్వ బాధ్యత' అనేది ప్రధానాంశంగా తీసుకొని ఉచిత నిర్బంధ విద్య, కామన్ స్కూల్ విద్య, శాస్త్రీయ విద్య, విద్యారంగ సమస్యలపై సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించి, కార్యాచరణ రూపొందించడానికి మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య బలోపేతం, పరిస్థితుల మార్పు కోసం టీపీటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తున్నదని, 2017లో సిద్దిపేటలో మొదటి రాష్ట్ర మహాసభలు నిర్వహించిందని, రెండో మహాసభలను ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క హాజరవుతారని తెలిపారు. విద్యారంగ, సామాజిక, ఆర్థిక, అంతర్జాతీయ అంశాలపై మేధావులు బుర్రా రమేశ్, హరగోపాల్, నర్సింహారెడ్డి, కాశీం, చందనా చక్రవర్తి, వేణుగోపాల్, ప్రసాద్ ప్రసంగించనున్నారని వివరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, మనోహరరాజు, ముత్యాల రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, భోగేశ్వర్, కవిత, రాములు, ఏవీ నాగేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.

రైతులకు మొండిచెయ్యి

నిరాశపరిచిన కాంగ్రెస్ బడ్జెట్

ఖమ్మం, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ రైతన్నలకు మొండిచెయ్యి చూపింది. రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు తగ్గినట్లుగా కేటాయింపులు లేవని, సామాన్యులను నిరాశపరిచే విధంగా ఉందని పెదవి విరుస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, మౌలిక వసతుల కల్పనకు సరైన నిధుల కేటాయింపు జరగలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టే గారడీ బడ్జెట్ మాదిరిగా ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే ఎక్కువ పేజీలు కేటాయించారని పేర్కొన్నారు.

రైతుకు భరోసా ఏది?

రైతులను ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. అంత ఉరిమి ఇంతేనా కురిసింది అన్నట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్. వ్యవసాయానికి రూ.7,085 వేల కోట్లు కోత విధించడంతో రైతులు సంక్షోభం ఎదుర్కోక తప్పదు. గత ప్రభుత్వం వ్యవసాయానికి రూ.26,831 కోట్లు కేటాయించగా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.19,746 కోట్లు మాత్రమే కేటాయించింది. రైతులు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేల పంట పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ బడ్జెట్‌లో మొండిచేయి చూపింది. రుణమాఫీ మాట ఇక దేవుడెరుగు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు, వరికి రూ.500 బోనస్ ప్రస్తావన లేకపోవడం దయనీయం. రైతును రాజు చేసేందుకు కేసీఆర్ అహర్నిశలు కృషిచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతన్నలను ఆగం చేస్తున్నది.

– నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ

అంకెల గారడీ..

కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమే. వ్యవసాయానికి రూ.19,746 కోట్లు మాత్రమే కేటాయించింది. రైతుబంధు, రైతు రుణమాఫీ, పంటబీమా, రైతు బీమా, వడ్డీ లేని పంటరుణాలు ఇక ప్రశ్నార్థకమే. అంటే కాంగ్రెస్ పార్టీ రైతులను నిలువునా దగా చేసింది. బీసీ సంక్షేమానికి రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించి బీసీలను కూడా మోసం చేసింది. సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన రూ.28 వేల కోట్లు ఎటూ సరిపోవు. ఇందిరమ్మ ఇండ్ల గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ బడ్జెట్‌లో కేటాయించింది రూ.7,700 కోట్లు. కార్మికులకు మొండిచేయి చూపింది. తెలంగాణ ప్రజానీకానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి.

– తాతా మధు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

15 నుంచి 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ఎగ్జిబిషన్'

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 10 : నాబార్డ్ సహకారంతో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ) 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ఎగ్జిబిషన్' కార్యక్రమాన్ని ఈ నెల 15న కొత్తగూడెంలో నిర్వహిస్తున్నట్లు భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలను ఎంపిక చేశారన్నారు. ఈ నెల 15న కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో రూపొందించిన ఆవిష్కరణలను ప్రదర్శించడానికి 30 మంది పల్లె సృజన తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆవిష్కర్తలను ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు వాణి, పీఆర్ మేనేజర్, ఇన్నోవేషన్, సెల్ 9441191829 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి : డీఈవో

మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర శర్మ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని డీఈవో సోమేశేఖర శర్మ అన్నారు. తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(టీఎస్ కాస్ట్) ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా శనివారం నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సైన్స్‌పై పట్టు సాధించడానికి చిన్నతనం నుంచే కష్టపడి చదవాలన్నారు. కాగా.. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 28న సైన్స్‌డే రోజు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ కాస్ట్ అధికారి వెంకటేశ్వరరావు, జగదీశ్వర్, ఇనుముల వెంకటేశ్వర్లు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 10 : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పని చేస్తున్న ఎం.శైలజ, ఖమ్మం ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న ఎస్.శ్వేతలను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న కె.శ్రీనివాసరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ పొందనున్న నేలకొండపల్లి తహసీల్దార్ పి.అనురాధబాయిని కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. కాగా.. ఆరు నెలల్లోపు ఉద్యోగ విరమణ చేసే అధికారులను ఎన్నికల విధులకు సంబంధం లేని పోస్టులకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న అధికారులు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఆదేశించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇద్దరు ఆర్డీవోలు, ఎనిమిది మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బదిలీ ఉత్తర్వులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చాయి. కొత్తగూడెం ఆర్డీవో శిరీష, పాల్వంచ సీతారామ భూసేకరణ విభాగంలో పని చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవిని డిపార్ట్‌మెంట్‌కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారి స్థానంలో కొత్తగూడెం ఆర్డీవోగా డి.మధు మెట్‌పల్లి నుంచి బదిలీపై వస్తున్నారు. పాల్వంచ డిప్యూటీ కలెక్టర్‌గా వెయిటింగ్‌లో ఉన్న శంకర్‌కుమార్‌ను నియమించారు. దీంతోపాటు ఆళ్లపల్లి, చండ్రుగొండ, చర్ల, కరకగూడెం, పాల్వంచ, పినపాక, టేకులపల్లి, జూలూరుపాడు మండలాల్లో పని చేస్తున్న తహసీల్దార్లను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల్లో పని చేస్తున్న తహసీల్దార్లను భద్రాది జిల్లాకు కేటాయించారు.

'ట్రోలింగ్'పై మహిళలు ఉద్యమించాలి

- సమాజానికి ప్రమాదకరంగా మారిన విపరీత ధోరణి ఇది..
- ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ మహాసభల్లో వక్తలు

'ట్రోల్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ఖమ్మం, ఫిబ్రవరి 10 : దేశంలో మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌ను ఎదుర్కోవడానికి మహిళలంతా సిద్ధంగా ఉండాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ట్రోలింగ్ అనేది సమాజానికి ప్రమాదకరంగా మారిందని, దీనిపై మహిళలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్లో వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత అధ్యక్షతన శనివారం ప్రారంభమైన వేదిక ఏడో మహాసభలకు ప్రముఖ వక్తలు హాజరయ్యారు. ముందుగా రచయిత్రుల వేదిక పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీబీసీ తెలుగు ఎడిటర్ రామ్మోహన్‌రావు, ప్రముఖ రచయిత్రి ఓల్గా మాట్లాడారు. సోషల్‌మీడియా వేదికగా మహిళలపై ట్రోలింగ్ విపరీతంగా జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక పెట్టుబడిదారీ వ్యవస్థలు ఈ ట్రోలింగ్‌ను తమ వ్యాపార సామ్రాజ్య విస్తరణకు ఉపయోగించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. పాలకులు సైతం విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకు మాదిరిగానే పరిగణిస్తున్నారని అభిప్రాయపడ్డారు. గడిచిన 15 ఏళ్లుగా సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగిస్తున్నారని అన్నారు. వాటి వల్ల ప్రయోజనాలతోపాటు ట్రోలింగ్ వంటి అవాంఛనీయ ధోరణులు కూడా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అనేక రాజకీయ పార్టీల నాయకులు, కుల, మతతత్వ సంస్థల బాధ్యులు, అప్రజాస్వామికులు.. భిన్నాభిప్రాయాన్ని అణిచివేసేందుకు ట్రోలింగ్‌ను వ్యవస్థీకృతం చేసి లబ్ధిపొందుతున్నారని విమర్శించారు. ఈ ట్రోలింగ్ వెనుక దేశంలోని పెట్టుబడిదారుల ఆర్థిక ప్రయోజనాలు దాగి ఉన్నాయన్నారు. సమాజంలో ఏ చెడు ధోరణులైనా తలెత్తినప్పుడు దానికి ముందుగా బలయ్యేది స్త్రీలు మాత్రమేనని, అందులోనూ దళిత, మైనార్టీ తదితర పీడిత అస్థిత్వానికి చెందిన వారు ఉంటారని అన్నారు. ఈ సమస్యలను సూక్ష్మస్థాయిలో అర్థం చేసుకోవడానికే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక పనిచేస్తోందని, అందుకే స్త్రీలపై ట్రోలింగ్ అనే అంశాన్ని ఈ మహాసభలు ముఖ్యాంశంగా తీసుకున్నాయని వివరించారు. అనంతరం పలువురు వక్తలు వివిధ అంశాలపై ఉపన్యసించారు. ఆ తరువాత 'ట్రోల్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మహాసభల సమన్వయకర్త రవిమారుత్, ప్రముఖులు నారాయణ వేణు, ఖాదర్ మొహియుద్దీన్, ఉరిమళ్ల సునంద, దేవకిదేవి, వేణుగోపాల్, కొండెపూడి నిర్మల, కృష్ణకుమారి, వనజ తదితరులు పాల్గొన్నారు.